# సీతాపతి కథ

★

రచన :

శ్రీ రేగుంపాటి కిషన్ రావు



కాలింగ్ బెల్ మ్రోగింది.

మెల్లగా హెడ్ మాస్టర్ రూము వైపు నడచివస్తున్న సీతాపతి గబగబా అడుగులు వేస్తూ హెడ్ మాస్టర్ గారి ముందుకు వచ్చేసాడు

హెడ్ మాస్టర్ కళ్ళద్దాలు సవరించుకొని సీతాపతిని నిశితంగా చూస్తూ అన్నాడు 'ఆకుపచ్చ పేపర్ వెయిట్ కనిపించడం లేదేం'

'రాములు తీశాడేమో' నసిగాడు సీతాపతి.

అప్పుడే గదిలోకి వస్తున్న రాములు అది విని అన్నాడు 'నేనా! నేనెందుకు తీస్తాను?'

'నువ్వు తియ్యకపోతే అదే ఎక్కడికైన నడచి పోయిందా?' కాస్త కోపంగా అన్నాడు సీతాపతి.

'నాకేం తెలుసు నిన్న సాయంకాలం స్కూల్ వదలగానే వెళ్ళిపోయాను. ఈ రోజు బడికి వచ్చి అరగంట గడచినా ఈ గదిలోకి మాత్రం ఇప్పుడే వస్తున్నాను. నిన్న సాయంకాలం వరకు కనిపించిన పేపర్ వెయిట్ ఈరోజు కనిపించకపోతే అందుకు బాధ్యుణ్ని నేను కాదుగదా! ఏ దొంగ వెధవ తీశాడో ఏమో...'

చివరికి రాములు అనదలచుకున్నది పూర్తిగా అనక ముందే హెడ్ మాస్టర్ రాములువైపు చూస్తూ అన్నాడు. 'ఆఫీసులో ఏమిటా తిట్లు వెళ్ళికాస్త మంచి నీళ్ళు తెచ్చి ఇవ్వు మన బావి నీళ్ళు వద్దు ఆ బోరింగ్ నీళ్ళు తీసుకరా'.

రాములు కూజా పట్టుకొని వెళ్ళిపోయాడు.

'పాఠశాల వదిలాక మళ్ళీ పాఠశాల ప్రారంభం అయ్యేలోగా ఏ వస్తువు పోయినా అందుకు నువ్వే బాధ్యుడివన్న విషయం మరోసారి చెప్తున్నాను మరచిపోకు' హెడ్ మాస్టర్ ఈ మాటలు అన్నాక నోటీసు రిజిష్టర్ తెరచి ఏదో వ్రాసి సీతాపతి వైపు చూస్తూ అన్నాడు 'పేపర్ వెయిట్ సంగతి తర్వాత చూద్దువుగానీ ముందీ నోటీసు అన్ని క్లాసుల్లో చూపించిరా'.

సీతాపతి క్షణం సేపు ఆలోచించి 'సరే ఇలా ఇవ్వండి' అని నోటీసు రిజిష్టర్ తీసుకొని వెళ్ళిపోయాడు.

'నాద్యూటీ రాత్రిగానీ పగలుకాదు' అన్నట్టు ఇన్నాళ్ళూ తప్పించుకున్న సీతాపతి కిక్కురుమనకుండా

ఆరోగ్య సౌభాగ్యములకు మహిళలు
ఆధారపడునవి
ఆరోగ్య అనారోగ్య పరిస్థితులలో
లోధ్ర
గర్భపోషణకు సుఖ ప్రసవమునకు
గర్భ రక్షక
వేవిళ్ళకు, మలబద్ధకమునకు
మాదీ ఫల రసాయనం
ప్రసవానంతరం బలమునకు, క్షీరవృద్ధికి
సౌభాగ్య శొంఠి
కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్,
మద్రాసు - 600 014.
ఏజెంట్లు :-
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజెన్సీస్)
విజయవాడ - సికిందరాబాద్.

రిజిస్టర్ తీసుకొని వెళ్ళిపోవడం చూచిన హెడ్ మాస్టర్ తన యుక్తి ఫలించినందుకు తనలో తను నవ్వుకున్నాడు.

* * *

సీతాపతి ఇంటర్ మీడియట్ పాసయ్యాక పై చదువులు చదవాలనుకున్నాడు. కాని ఆనాటి వాళ్ళ కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల పై చదువులు చదవలేక పోయాడు. ఆ రోజుల్లోనే టీచర్ ట్రేనింగ్ కు అప్లయి చేశాడు. కాని ఆ ట్రేనింగ్ లో కూడా అతనికి సీటు దొరకలేదు. ఆ తర్వాత కాలంలో ఎన్నో ఉద్యోగాలకు అప్లికేషన్లు పెట్టాడు. ఎప్పటికప్పుడు ఉద్యోగం దొరుకుతుందని ఆశపడేవాడు. తీరా ఆర్డర్లు వెళ్ళాయని తెలిశాక ఆ ఆర్డర్లలో తన పేరు లేకపోవడం చూశాక బాధపడిపోయేవాడు. విసిగిపోయాడు కూడా. ఇక ఏ ఉద్యోగానికీ అప్లికేషన్ పెట్టకూడదనుకున్నాడు. అలా అనుకున్నాడే కాని చిల్లర పనులు చేయలేక చేసేశక్తిలేక మళ్ళీమళ్ళీ చిన్న చిన్న ఉద్యోగాలకు సహితం అప్లికేషన్లు పెట్టుకున్నాడు. ఎంత చిన్న ఉద్యోగమైనా సరే గవర్నమెంటు ఉద్యోగమైతే చాలనుకున్నాడు. అలా అనుకోవడానికి కారణం వుంది. ఇతరుల కూలీ పనో పాలేరు పనో తప్ప మరేపని దొరికేట్టు లేదు. అలాంటి పనులు చేసే శక్తి అతని శరీరంలో లేదు. పది రోజులు మామూలుగా ఆరోగ్యంగా వుంటే నాలుగు రోజులు ఏదో జబ్బుతో బాధపడుతూనే వుంటాడు. అందుకే అతడు ఏదైనా, అది ఎంత చిన్నదైనా గవర్నమెంటు ఉద్యోగమే చేయాలనుకుంటున్నాడు.

ఆ మధ్య కాలంలోనే తండ్రీ, సవతితల్లీ చనిపోవడంతో తనను తాను పోషించుకోవాల్సిన బాధ్యతతో పాటు భార్యను పోషించాల్సిన బాధ్యత, కాలేజీ చదువుల్లో ఇరుక్కుపోయిన సవతి తమ్మునికి ఆర్థికంగా సహకరించాల్సిన బాధ్యత ఇలా అన్ని బాధ్యతలూ తన మీదనే పడ్డాయి.

ఓసారి పత్రికలో నైట్ వాచ్ మెన్ ఉద్యోగాలకు అప్లికేషన్ కోర బడ్డాయి. సీతాపతి ఆ ఉద్యోగానికి అప్లికేషన్ పెడుదునా వద్దా అనుకుంటూ మిత్రులను సలహా అడిగాడు. కొంతమంది 'నువ్వు వాచ్ మెన్ ఉద్యోగం కూడా చెయ్యదలచావా? మన కుటుంబాలలో ఎవరైనా

అలాంటి ఉద్యోగాలు చేస్తున్నారా? వాచ్ మెన్ ఉద్యోగం గౌరవప్రదమైందని నువ్వు భావిస్తే అలాగే చెయ్యి' అన్నారు మరికొందరు 'ఆ ఉద్యోగం చేసే వాళ్ళు ఎందరికో లొంగి వుండవలసివస్తుంది. పైగా అధికారులు పగలు కూడా వాళ్ళతో పనిచేయిస్తుంటారు. చేయనంటే. అది నా డ్యూటీ కాదంటే మరోరకంగా లొంగదీసుకుంటారు', అన్నారు. ఒకరిద్దరు మాత్రం అప్లికేషన్ పెట్టమన్నారు. ఏమైనా సరేనని సీతాపతి అప్లికేషన్ పెట్టేశాడు. ఈ ఉద్యోగం కూడా దొరుకుతుందో లేదో అని అనుమానపడుతున్న సమయంలో పాఠశాల నైట్ వాచ్ మెన్ ఉద్యోగం వచ్చేసింది.


సీతాపతి ఆ ఆర్డర్ను చూచి ఆశ్చర్యపడ్డాడు, ఆనందపడ్డాడు. స్వంత గ్రామంలోనే ఉద్యోగం దొరకడం అనేది సీతాపతికి మరింత ఆశ్చర్యాన్ని కలిగించింది.

'ఆ ఉద్యోగం చెయ్యబోకు మరేదైనా ఉద్యోగం చూచుకో' అన్నారు కొందరు 'ఈ ఉద్యోగంలో చేరి మరేదైనా ఉద్యోగం కోసం ప్రయత్నించు' అన్నారు కొందరు 'ఏ ఉద్యోగం అయితే ఏమిటి? మన డ్యూటీ మనం చేస్తుంటే సరిపోతుంది' అన్నారు కొందరు. అలా చాలా మంది చాలా రకాల అభిప్రాయాలు వెల్లడించారు. అందరి అభిప్రాయాలు విని సీతాపతి ఉద్యోగంలో చేరిపోయాడు

డ్యూటీ సక్రమంగా చేయాలన్న అభిప్రాయంతో వున్న సీతాపతి రాత్రివేళ పాఠశాలలోనే పడుకునేవాడు వారానికో పదిరోజులకో ఓ రాత్రి మాత్రం స్వంత ఇంట్లో అర్ధాంగి ప్రక్కన పడుకొని తెల్లవారేదాక వుండిపోయేవాడు అయినా సరే తెలవగానే బడికి వెళ్ళిపోయేవాడు పాఠశాలకు రాములు రాగానే సీతాపతి ఇంటికి వెళ్ళిపోయేవాడు.

హెడ్ మాస్టర్ అప్పుడప్పుడు పాఠశాల పనిచేసే సమయంలో సీతాపతిని రమ్మంటూ రాములుతో కబురు చేసేవాడు సీతాపతి ఏదో వంక చెప్పి పాఠశాలకు వెళ్ళకుండా ఇంట్లోనే వుండిపోయేవాడు. అప్పుడప్పుడు నవ్వుతూ 'నా డ్యూటీ రాత్రి కాని పగలు కాదు' అని కూడా అనేవాడు.

అలా కొన్నివారాలు గడిచిపోయాయి.



S SKP M

JET PUMPS

has all that you'd expect of the best Make in India

SREE KRISHNA FOUNDRY
4/17, AVANASHI ROAD
COIMBATORE-641037

MANUFACTURERS OF:
SKM SKP PUMPS MOTORS
UNIT PUMPING SETS

ఆ రోజు సీతాపతి పాఠశాల నుండి ఇంటికి వచ్చి పది నిమిషాలు గడిచాయో లేదో రాములు అతని దగ్గరకు గబగబా వచ్చి 'హెడ్ మాస్టర్ గారు రమ్మంటున్నారు' అని చెప్పాడు

సీతాపతి గతరాత్రి స్కూల్లోనే పడుకున్నాడు దోమలు కుట్టడం వల్ల సరిగా నిద్ర పట్టలేదు. పైగా గత రాత్రి అన్నం తిననందున ఆకలితో వున్నాడు ఆయన భార్య ఇంకా వంటపని పూర్తి చేయలేదు. రాములు వచ్చే సరికి సీతాపతి విసుగుతో కోపంతో వున్నాడు. 'నా డ్యూటీ రాత్రివేళ గానీ పగలు కాదు. నేనిప్పుడు రాలేను' అన్నాడు.

'అలా అంటే ఎలా హెడ్ మాస్టర్ ఎంతపనిలో వున్నా రమ్మన్నారు'.

'నేను రానన్నానని చెప్పు' విసుగ్గా అన్నాడు సీతాపతి.

'నువ్వు నీ డ్యూటీ తప్ప పాఠశాలకు సంబంధించిన మరేపనీ చేయనన్న ఉద్దేశంతోనూ, ఎవరికీ లొంగి వుండనన్న ఆలోచనలోనూ వున్నట్టున్నావు. ఇలాంటి అభిప్రాయాలు వున్న నీలాంటి వాళ్ళను పై అధికారులు అణచడానికే ప్రయత్నం చేస్తారు నీకు అనుభవం లేదు అనుభవం వున్న నేను చెప్తున్నాను. హెడ్ మాస్టర్ గారు చెప్పినట్టు వింటే నీకు ఎలాంటి చిక్కులూ రావు ఇంతకంటే నేనెక్కువ చెప్పలేను తర్వాత నీ ఇష్టం' రాములు తను చెప్పదలచుకున్నదంతా చెప్పేసి ఊరుకున్నాడు.

సీతాపతి క్షణం ఆలోచించి అన్నాడు 'ఓ గంట తర్వాత వస్తానని చెప్పు'.

రాములు వెళ్ళిపోయాడు. పదినిమిషాలు గడవక ముందే మళ్ళీ వచ్చాడు. 'హెడ్ మాస్టర్ గారు ఇప్పుడే రమ్మంటున్నారు'.

సీతాపతి ఆలోచనలో పడ్డాడు...ఇప్పటికీ వెళ్ళక పోతే హెడ్ మాస్టర్ తన మీద కోపం పెంచుకుంటాడేమో. తనను అణచడానికి అక్రమ పద్ధతులు అవలం దేమో గుంటనక్క హెడ్ మాస్టర్ నవ్వుతూ పీకలు పిసికే రకం. అతడు తనమీద లేనిపోనివి కల్పించి పై అధికారులకు రాస్తే తన ఉద్యోగం ఏమవుతుందో? హెడ్ మాస్టర్ చెప్పినట్టు వింటే రాత్రివేళ పాఠశాలలో పడుకోకపోయినా ఇంట్లో పడుకున్నా ప్రత్యేకంగా పట్టించుకోకపోవచ్చు తనను మందలించకపోవచ్చు...

'తొందరగా రా! నేను వెళ్తున్నా' అని చెప్పి రాములు వెళ్ళిపోయాడు.

సీతాపతి ఇంకా ఇలా ఆలోచించాడు ... దేశం మొత్తం మీద మాటఅటుంచి ఒక్క ఆంధ్రదేశంలోనే వేల సంఖ్యలో పాఠశాలలున్నాయి. అందులో చాలా కొద్ది పాఠశాలలకు మాత్రమే నైట్ వాచ్ మెన్ ఉన్నారు. నైట్ వాచ్ మెన్లు లేని పాఠశాలల్లో కూడా వందలూ, వేలూ విలువగల వస్తువులు వుండనే వున్నాయి. నైట్ వాచ్ మెన్లు లేని అనేక పాఠశాలల్లో మాత్రం రాత్రివేళ దొంగతనాలు జరుగుతున్నాయా? జరిగే దొంగతనాలు నైట్ వాచ్ మెన్లు లేని పాఠశాలలు, ఉన్న పాఠశాలలు అనే భేదం లేకుండా ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఓ పాఠశాలలో జరుగుతూనే వున్నాయి. తను పాఠశాలలో పడుకోకపోతే దొంగతనం జరుగుతుందనిగానీ, పడుకుంటే జరగబోయే దొంగతనాన్ని ఆపగలనన్న నమ్మకం గానీ సీతాపతికి లేదు. కాని రాత్రివేళ పాఠశాలలో పడుకోకపోతే పై అధికారుల దృష్టికి రావచ్చు. ఏవో ఇబ్బందులకు గురికానూ వచ్చు. హెడ్ మాస్టర్ చెప్పినట్టు వింటే రాత్రివేళ పాఠశాలలో అప్పుడప్పుడు పడుకోకపోయినా హెడ్ మాస్టర్ ప్రత్యేకించి పట్టించుకోక పోవచ్చు. పై అధికారుల దృష్టికి తీసుకు రాకపోవచ్చు.

(సశేషం)

